

ఫిర్యాదుల వెల్లువ

భూఆక్రమణలపై పలాసలో రెవెన్యూ అధికారులు నిర్వహించిన ప్రత్యేక స్పందనకు విశేష స్పందన లభించింది. - 10లో



ముగిసిన ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు ముగిశాయి. జిల్లాలో 109 కేంద్రాల్లో ప్రశాంతంగా పరీక్షలు పూర్తవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. - 10లో

నేడు పన్నుల చెల్లింపునకు అవకాశం

శ్రీకాకుళం (పీఎస్‌కాలనీ): రాష్ట్ర ప్రభుత్వం ఇంటిపన్ను, ఖాళీ స్థలం పన్నులపై వడ్డీమాఫీ చేసిన నేపథ్యంలో పన్ను చెల్లించే వారి సౌలభ్యం కోసం శ్రీరామనవమి సెలవు రోజున కూడా శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటుచేసినట్లు కమిషనర్ ఓబులేసు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.





జలుమూరు: నామాలపేట వద్ద ఆసరా సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



హిరమండలం: ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

న్యూస్‌రీల్

మోటార్ ట్రైసైకిల్ లబ్ధిదారుల జాబితా సిద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: మూడు చక్రాల మోటరైజ్డ్ వాహనాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఎంపిక జాబితా సిద్ధమైనట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ పీడీ ఎం.కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంయుక్త కలెక్టరు/చైర్మన్‌గా, ఏడుగురు జిల్లా అధికారులతో కూడిన కమిటీ ఆమోదించిన ఎంపిక జాబితాను జిల్లా వెబ్‌సైట్ (శ్రీకాకుళం.ఏపీ.జీఓవీ.ఇన్) లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 1 సాయంత్రం 5 గంటల్లోగా అభ్యంతరాలు తెలియజేయవచ్చన్నారు.

ఆదిత్యుని ఆదాయం రూ.50.10 లక్షలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపులో రికార్డు స్థాయిలో రూ.50,10,437 ఆదాయం సమకూరిందని ఈవో వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. వీటితో పాటు 104 గ్రాముల బంగారం, 2,200 గ్రాముల వెండి వస్తువులు లభించినట్లు వెల్లడించారు. జిల్లా దేవదాయ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ బి.వి.వి.ఆర్.ప్రసాద్ పట్నాయక్ పర్యవేక్షించగా, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, పాలకమండలి సభ్యులు నెమలపురి కోటేశ్వర చౌదరి, ద్వారపు అనూరాధ, జలగడుగుల శ్రీనివాస్, దేవదాయ శాఖ సీనియర్ అసిస్టెంట్లు రవికుమార్, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. వన్‌టౌన్ ఎస్సై బలివాడ గణేష్ బందోబస్తు నిర్వహించారు. గత నెల 14 నుంచి ఈ నెల 29 వరకు మొత్తం 44 రోజులకు గాను ఈ ఆదాయం లభించినట్లు ఈఓ తెలిపారు.

3 నుంచి పింఛన్ల పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు ఏప్రిల్ 3 నుంచి పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ విద్యాసాగర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1 ఆర్థిక సంవత్సరం ముగింపు, 2వ తేదీ ఆదివారం కావడంతో 3వ తేదీ నుంచి పంపిణీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. లబ్ధిదారులంతా గమనించాలని కోరారు.

సూదిమొనపై రామబాణం



కాశీబుగ్గ : మున్సిపాలిటీలో 21వ వార్డుకు చెందిన సూక్ష్మచిత్ర కళాకారుడు కొత్తపల్లి రమేష్ ఆచారి శ్రీరామనవమి సందర్భంగా బంగారు రేకుపై రామబాణం తయారుచేశారు. ఇందుకు రెండు గంటల పాటు శ్రమించి 0.100 మిల్లీ గ్రాముల బంగారాన్ని వినియోగించారు.

వైద్యారోగ్య శాఖలో 39 పోస్టులు

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖలో ఖాళీ పోస్టులను ఒప్పంద, కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిజన్ (జిల్లా జైలు) ఆస్పత్రిలో ఫార్మాసిస్టు (గ్రేడ్-2) పోస్టు, మేల్ నర్సింగ్ ఆర్డర్లీ (ఎంఎన్‌వో) పోస్టు, ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీ (ఎఫ్ఎన్‌వో) పోస్టులను ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నామని పేర్కొన్నారు. అదే విధంగా, నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఆధ్వర్యంలో జిల్లా, జనరల్ ప్రభుత్వ ఆస్పత్రులు, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో పీడియాట్రిషియన్ పోస్టు, గైనకాలజిస్టు 2 పోస్టులు, మెడికల్ ఆఫీసర్లు 22 పోస్టులు, డెంటల్ హైజినిస్టు 9 పోస్టులు, డెంటల్ టెక్నీషియన్ ఒక పోస్టు, క్లినికల్ సైకాలజిస్టు పోస్టును భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులు ఏప్రిల్ 6 సాయంత్రం 5 గంటల్లోగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు. పూర్తి వివరాలకు 'శ్రీకాకుళం.ఏపీ.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

● ఆసరా.. ఆనందం



లావేరు: లావేరు హైస్కూల్ గ్రౌండ్‌లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, మహిళలు

వైఎస్సార్ ఆసరా సంబరాలు జనజాతరను తలపిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహిస్తున్న సభలకు మహిళలు పోటెత్తుతున్నారు. రుణమాఫీ సొమ్మును తమ ఖాతాలకు వరుసగా మూడో విడత జమ చేసిన జగనన్నను అక్క చెల్లెమ్మలు మనసారా ఆశీర్వదిస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్



కంచిలి: ఆసరా చెక్కును అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, సమన్వయకర్త పిరియా సాయిరాజ్

చిత్తశుద్ధి.. లాభసిద్ధి

ఆర్థిక పరిపుష్టి సాధించిన డీసీఎంఎస్
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మారిన దశ
- సంస్థ అభివృద్ధిపై దృష్టి పెట్టిన పాలకవర్గం
- ఇప్పటి వరకు రూ.34 లక్షల అదనపు ఆదాయం ఆర్జన



అరసవల్లిలో డీసీఎంఎస్ ప్రధాన కార్యాలయం

నాడు
- టీడీపీ హయాంలో డీసీఎంఎస్‌లో జీతాలిచ్చుకోలేని పరిస్థితి
- కొన్ని కాంట్రాక్ట్‌లపైనే ఆధారపడ్డ దుస్థితి
- ఆక్రమణకు గురైన సంస్థ ఆస్తులు
- నిరుపయోగంగా, శిథిలావస్థకు గురైన గొడౌన్లు, భవనాలు

నేడు
- వైఎస్సార్‌సీపీ పాలనలో మెరుగైన సంస్థ ఆదాయం
- ఆక్రమిత స్థలాలపై ఉక్కుపాదం.. ఎక్కడికక్కడ స్వాధీనం
- ఆదాయం పెంచుకునేందుకు పక్కాగా ప్రణాళికలు
- స్థలాల్లో సూపర్ మార్కెట్, గోదాములు, షాపుల నిర్మాణం
- అద్దెకిచ్చి అదనపు ఆదాయం సముపార్జన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ఆర్థిక పరిపుష్టి సాధించింది. ఒకప్పుడు ఉద్యోగులకు జీతాలే ఇచ్చుకోలేని పరిస్థితి నుంచి నేడు అదనపు ఆదాయం ఆర్జించే స్థితికి చేరుకుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పడిన పాలకవర్గం, అధికార యంత్రాంగం కృషితో ఇది సాధ్యమైందని కచ్చితంగా చెప్పవచ్చు. గతంలో కూడా అధికారులు, ఉద్యోగులున్నా సొంతంగా ఆదాయం పెంచుకునే ప్రణాళికలు పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. డీసీఎంఎస్ వివిధ ప్రభుత్వ సంస్థలకు సరుకులు సరఫరా చేసే కాంట్రాక్ట్ మాత్రమే చేసేది. అది కూడా సంబంధిత అధికారులపై ఆధారపడి ఉండేది. ఆ వచ్చిన కాంట్రాక్ట్‌లను సైతం సబ్ కాంట్రాక్ట్‌లుగా ఇచ్చేసి ప్రేక్షక పాత్ర పోషించేది. పాలకవర్గ పెద్దల సన్నిహితులకు ఆ కాంట్రాక్ట్‌లిచ్చేసి, వారిచ్చే కొద్దిపాటి కమీషన్లతో సంతృప్తి చెందేది. ఈ పరిస్థితుల్లో వచ్చే ఆదాయం ఏమాత్రం సరిపోయేది కాదు. ఉద్యోగుల జీతభత్యాలు ఇచ్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. కొన్నాళ్లకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతను తీసుకుంది. వీటి నిర్వహణ కోసం ప్రభుత్వమిచ్చే కమిషన్‌పై ఆధారపడాల్సి వచ్చేది. దీనివల్ల ఉద్యోగుల జీతభత్యాల సమస్య కొంత పరిష్కారమైనా సొంతంగా ఆదాయం సమకూర్చుకునే యత్నాలు జరగలేదు.

చురుగ్గా పాలకవర్గం..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఏర్పాటైన పాలకవర్గం చురుగ్గా పనిచేస్తోంది. ఆదాయం సమకూర్చే మార్గాలను అన్వేషించింది. తమ కాళ్లపై నిలబడేలా సొసైటీని ముందుకు తీసుకెళ్లింది. ఎవరిపైనో ఆధారపడకుండా సొంతంగా వ్యాపార లావాదేవీలు సాగించే ప్రయత్నం చేసింది. దీంతో దాదాపు 34లక్షల అదనపు ఆదాయాన్ని సంపాదించింది. సంబంధిత ఉద్యోగులే ఆశ్చర్యపోయేలా ఆదాయ సముపార్జన చేసింది. ప్రస్తుతం 25మంది రెగ్యులర్, తాత్కాలిక, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుండగా వారంతా ఇప్పుడు ఆనందంగా పనిచేస్తున్న పరిస్థితి నెలకొంది. గతంలో జీతాలు ఎప్పుడు వస్తాయో అన్న పరిస్థితి ఉండేది. ఇప్పుడా భయం పోవడమే కాకుండా సంస్థ ఆర్థికంగా పరిపుష్టి సాధించడంతో భవిష్యత్‌పై కమ్ముకున్న నీలినీడలు తొలగిపోయాయి.

ఆక్రమణల తొలగింపుపై దృష్టి

గతంలో పాలకవర్గాలు సీరియస్‌గా పట్టించుకోకపోవడంతో చాలావరకు డీసీఎంఎస్ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆక్రమణలు తొలగించి, వాటిని ఆదాయ సంపాదనకు వినియోగించారు. శిథిలావస్థకు చేరుకున్న గొడౌన్‌లు, షాపులకు సైతం మరమ్మతులు చేయించి అద్దెకివ్వడంతో సంస్థకు భారీగా ఆదాయం సమకూరుతోంది.

తీసుకున్న చర్యల్లో కొన్ని..

- అరసవల్లిలో శిథిలావస్థకు చేరిన ఆరు గొడౌన్ల ప్రాంగణంలో ఆక్రమణలు తొలగించారు. ప్రహరీ నిర్మించి, గొడౌన్‌లకు మరమ్మతులు చేసి సరుకు నిల్వ చేసుకునేందుకు అద్దెకు ఇచ్చారు. వీటి ద్వారా రూ.6లక్షల 24వేల మేర అదనపు ఆదాయం సమకూరింది. ఇదే స్థలంలో 867 స్క్వేర్ మీటర్ల స్థలాన్ని పెట్రోలు బంకు పెట్టేందుకు హెచ్‌పీసీఎల్‌కు లీజుకిచ్చారు. దీని ద్వారా నెలకి అద్దెగా రూ.76,700 అదనపు ఆదాయం వస్తోంది.
- శ్రీకాకుళం కత్తెరవీధిలో ఆక్రమణకు గురైన 37 సెంట్ల స్థలాన్ని స్వాధీనం చేసుకుని సూపర్ మార్కెట్ నిర్మించి, ప్రారంభించారు. దీని ద్వారా రూ.60వేల వరకు అదనపు ఆదాయం వస్తోంది.
- ఆమదాలవలసలో నిరుపయోగంగా ఉన్న స్థలంలో 13 చిన్న చిన్న గదులతో నిర్మాణం చేసి, వ్యాపారులకు, వృత్తిదారులకు అద్దెకు ఇచ్చారు. వీటి ద్వారా రూ.3లక్షల 12వేల అదనపు ఆదాయం వస్తోంది.
- ఉమ్మడి జిల్లాలోని వీరఘట్టంలో శిథిలావస్థలో ఉన్న గొడౌన్‌కు రిపేర్లు చేసి, ఐదు చిన్న గొడౌన్లుగా మార్చి అద్దెకు ఇచ్చారు. వీటి ద్వారా రూ.9లక్షల 12వేల అదనపు ఆదాయం వస్తోంది.
- మెళియాపుట్టి మండలం చాపరలో ఆక్రమణకు గురైన డీసీఎంఎస్ షాపింగ్ కాంప్లెక్స్ వెనకభాగాన్ని స్వాధీనం చేసుకున్నారు. రెండు గొడౌన్‌లను అద్దెకిచ్చి రూ. 2లక్షల 22వేల అదనపు ఆదాయం సమకూర్చుకున్నారు.
- హిరమండలంలో గొడౌన్‌లకు ఆనుకుని ఉన్న ఖాళీ స్థలం ఆక్రమణకు గురైంది. దానిని స్వాధీనం చేసుకుని అద్దెకిచ్చారు. గొడౌన్లకు మరమ్మతులు చేయించి అద్దెకిచ్చారు. వీటి ద్వారా రూ.లక్షా 92 వేల మేర అదనపు ఆదాయం వస్తోంది.
- పాతపట్నం శివశంకర్ కాలనీలో 15 సెంట్లు, జమ్ము(నరసన్నపేట)లో 76 సెంట్లు, రణస్థలం, టెక్కలిలో ఆక్రమిత స్థలాలను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేశారు. ఆక్రమణదారులు కొందరు కోర్టుకెళ్లడంతో న్యాయపరంగా పోరాటం చేస్తున్నారు.
- పొందూరు, రణస్థలం, పాలకొండ, మెళియాపుట్టి, ఆమదాలవలస, వీరఘట్టంలో ఉన్న మరి కొన్ని ఆస్తులను సర్వే చేసి, రెవెన్యూ పత్రాలు పొంది, ఆ ఆస్తుల రక్షణతో పాటు వాటిని వ్యాపార కేంద్రాలను మార్చు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు
- గతంలో కొనసాగుతున్న సంప్రదాయంగా ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రభుత్వ సంస్థలకు, ప్రభుత్వ వసతి గృహాలకు, అంగన్‌వాడీలకు ఆహార దినుసులు, స్టేషనరీ సామగ్రి సరఫరా చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా నిర్వహిస్తున్నారు.

భవిష్యత్ కార్యాచరణ..

- మెళియాపుట్టి, పాలకొండ, హిరమండలంలోని డీసీఎంఎస్ స్థలాలను పెట్రోల్ బంకుల ఏర్పాటు కోసం అద్దెకిచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.
- పొందూరు గొడౌన్ వద్ద ఐదారు షాపుల నిర్మించి అద్దెకిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.
- కత్తెర వీధిలో షాపులు నిర్మించి, వాటిని అద్దెకిచ్చి ఆదాయం సమకూర్చుకోనున్నారు.
- టెక్కలిలో 2.23ఎకరాల స్థలాన్ని షాపింగ్ మాల్‌కు అద్దెకివ్వడం ద్వారా లక్షలాది రూపాయల అదనపు ఆదాయం రానుంది.
- డీసీఎంఎస్ ఆఫీస్ వెనక భాగాన ఉన్న స్థలాన్ని ప్రైవేటు స్కూల్‌కు అద్దెకిచ్చే ఆలోచన చేస్తున్నారు. దీని ద్వారా రూ. 30వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.



లాభాల బాటలో ముందుకు..

గడ్డు పరిస్థితిని అధిగమించి, సంస్థను లాభాల బాటలో పయనించేలా చర్యలు తీసుకున్నాం. ఉద్యోగులు, జిల్లా ఉన్నతాధికారులు, మంత్రులు, స్పీకర్, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో సంస్థ ఆస్తులను రక్షించడమే కాకుండా వాటి ద్వారా అదనపు ఆదాయం తీసుకురావడంలో విజయవంతమయ్యాం. సంస్థ ప్రస్తుతం ఆర్థికంగా నిలబడింది. భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చెందనుంది. –సల్లా సుగుణ దేవరాజ్, చైర్‌పర్సన్, డీసీఎంఎస్

మహిళల భద్రతకు మరో అడుగు 112

- రాత్రివేళ సురక్షితంగా ఇంటికి చేర్చేలా 'డ్రాప్ టు హోమ్'
- వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎస్పీ రాధిక





ఎస్పీ జి.ఆర్.రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ఒంటరిగా రాత్రివేళ ప్రయాణంలో ఇరుక్కున్న మహిళలను సురక్షితంగా ఇంటికి చేర్చేలా మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు ఎస్పీ జి.ఆర్.రాధిక. అదే డ్రాప్ టు హోమ్. మీరు చేయాల్సిందల్లా టోల్ ఫ్రీ నంబర్ 112కు కాల్ చేయడమే. వెంటనే పోలీసులు స్పందించి తమ వాహనంలో మహిళలను వారి ఇంటి వద్ద సురక్షితంగా చేర్చుతారు. ఈ మేరకు ఎస్పీ రాధిక బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళల భద్రత కోసం పోలీసు శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. రాత్రి వేళ 11 గంటల తర్వాత ఇంటికి చేరుకోవడానికి రవాణా సౌకర్యం లేనిపక్షంలో అధైర్య పడకుండా 112కు కాల్ చేస్తే సబ్ డివిజనల్ పరిధిలోని దిశా వాహనాలు, పోలీస్ స్టేషన్ల పరిధిలోని వాహనాల ద్వారా ఇంటికి చేరుస్తారని పేర్కొన్నారు. రాత్రిపూట ప్రయాణం చేసే మహిళలు అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని, దగ్గరలో ఉన్న బస్సు, రైల్వే స్టేషన్‌లలో ఉన్న పోలీస్ ఔట్ పోస్టులు, రైల్వే పోలీసు రక్షక స్టేషన్‌లో వేచి ఉండాలని ఎస్పీ సూచించారు. ప్రతి మహిళా ఫోన్‌లో దిశా యాప్ డౌనులోడ్ చేసుకోవాలని ఎస్పీ కోరారు.

మాదక ద్రవ్యాలపై ఫిర్యాదులకు 14500

- మత్తు పదార్థాలు విక్రయించే షాపులపై నిఘా
- అధికారుల సమీక్షలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ రాధిక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్. చిత్రంలో ఎస్పీ రాధిక



శ్రీకాకుళం పాతబస్టాండ్: డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు ఎవరు విక్రయించినా, సేవించినా టోల్ ఫ్రీ నంబర్ 14500కు సమాచారం అందించవచ్చని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల నిరోధక శాఖ రూపొందించిన జాయింట్ యాక్షన్ ప్లాన్ అమలుపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ జి.ఆర్.రాధిక సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నివారణకు నెలవారీ కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల వాడకాన్ని పూర్తిగా నిరోధించాలన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించాలన్నారు. అవసరమైతే స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. మత్తు కలిగించే పదార్థాలను విక్రయించే షాపులపై నిఘా పెట్టాలన్నారు. మద్యం షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మందుల షాపులు, ఇతర ట్రేడర్స్‌తో సమావేశాలు నిర్వహించి చట్టంలోని అంశాలను వివరించాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల దుష్పరిణామాలను వివరిస్తూ విద్యాసంస్థల వద్ద హోర్డింగులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎక్కడా గంజాయి పంట లేదన్నారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వాడకం, రవాణా జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 14500కు కాల్ చేయాలన్నారు. అంతకుముందు ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిరోధానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ బాలరాజు, జిల్లా అటవీశాఖ అధికారి నిశాకుమారి, సెంట్రల్ ఇంటెలిజెన్స్ డీఎస్పీ కిషోర్, సేల్స్ టాక్స్ ఆఫీసర్ జి.రాజిమోహన్, అదనపు ఎస్పీ పి.విఠలేశ్వరరావు, సీపీఓ ప్రవీణ్ కుమార్, ఆర్‌డీఓ బి.శాంతి, జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్, డీఈఓ జి.పగడాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల హక్కుల పరిరక్షణకు 14567



ఎల్డర్ లైన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి



టెక్కలి: వయో వృద్ధులు కుటుంబపరంగా ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా టోల్‌ఫ్రీ నంబర్ 14567కు ఫిర్యాదు చేయవచ్చని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధుల నిర్వహణ, తల్లిదండ్రుల పోషణ చట్టంపై బుధవారం టెక్కలి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక చట్టం ద్వారా వృద్ధుల హక్కుల పరిరక్షణకు చర్యలు చేపడుతోందన్నారు. అనంతరం 14567 టోల్ ఫ్రీ నంబరు కలిగిన ఎల్డర్ లైన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ కిరణ్‌కుమార్, క్షేత్రస్థాయి సిబ్బంది తిరుపతిరావు, ఇన్‌చార్జి తహసీల్దారు కిషోర్, పోలీస్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మా ఊరి దేవుడు.. కోదండ రాముడు



పాలరాతి విగ్రహాలు

- శ్రీకాకుళంలో 200 ఏళ్ల నాటి రామాలయం
- పాలరాతి విగ్రహాలే ప్రత్యేకత
- నేడు సీతారాముల కల్యాణం

శ్రీకాకుళం కల్చరల్: రామనవమి ఉత్సవాలకు శ్రీరాముని ఆలయాలు సిద్ధమవుతున్నాయి. జిల్లా కేంద్రంలో రెండు వందల ఏళ్లుగా కోదండ రామాలయం ఈ పుణ్యక్రతువును ఏటా నిర్వహిస్తోంది. పట్టణం నడిబొడ్డున పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయం 1826లో నిర్మించినట్టు తెలుస్తోంది. ఈ ఆలయంలోని విగ్రహాలకు ఓ ప్రత్యేకత ఉంది. అన్ని ఆలయాల్లో దేవుని విగ్రహాలు దాదాపు నల్లరాతితో తయారు చేసినవే ఉంటాయి. కానీ ఇక్కడి సీతారామ,లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహాలు పాలరాతితో తయారు చేసినవి. వీటిని అయోధ్య నుంచి నాటుబళ్లపై శ్రీకాకుళం వరకు తీసుకువచ్చి ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతోంది.

జీయరు స్వామి రాక..

ఈ ఆలయంలో 1962లో శ్రీరామరామానుజ జీయరు స్వామి రామ స్థూపం ఏర్పాటు చేశారు. అందులో రామకోటి పుస్తకాలను నిక్షిప్తం చేశారు. దేశవ్యాప్తంగా 108 ప్రదేశాల్లో స్థూపాలను జీయరు స్వామి ఏర్పాటు చేశారు. శ్రీకాకుళంలో ఏర్పాటు చేసిన స్థూపం ఇరవై ఏడవది.

కార్యక్రమాలివే..

కోదండ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు ఈనెల 30నుంచి ఏప్రిల్ 6 వరకు జరుగనున్నాయి. 30న స్వామివారి కల్యాణం, రావాడ రామారావు బృందం శ్రీసీతారామ సంగీత విభావరి జరుగుతుందని ఆలయ అర్చకులు శేషాచార్యులు, ఈఓ గురునాథరావు తెలిపారు. ఏప్రిల్ 1న స్వామివారి తిరువీధి, కల్యాణం, 3న రథోత్సవం, 4న దూపోత్సవం, 5న స్వామివారి కల్యాణం, శ్రీరామచంద్ర ప్రభువుకు పట్టాభిషేకం, దమనోత్సవం, దర్బార్ (ఆస్థానోత్సవం), 6న పాలికోద్వాసన, పుష్పయాగం, ద్వాదశ తిరువారాధన జరుగుతుందని తెలిపారు.



ఆలయం



లక్ష్మీనర్సుపేటకు చెందిన సైకత శిల్పి తరణి ప్రసాద్ మిశ్రా శ్రీరామనవమి సందర్భంగా వంశధార నదీతీరంలో ఇసుకతో 'జైశ్రీరామ్' సైకత శిల్పం రూపొందించారు.- ఎల్.ఎన్.పేట

క్లుప్తంగా

టీబీ రోగుల కోసం రూ. లక్ష విరాళం



చెక్కు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించడానికి సీనియర్ సిటిజెన్స్ ప్రతినిధులు ముందుకొచ్చారు. ఈ మేరకు 1,05,000 రూపాయల చెక్కును రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రతి రిటైర్డు ఉద్యోగి ఒక క్షయ వ్యాధిగ్రస్తుడిని దత్తత తీసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. అలాగే రెడ్‌క్రాస్ సభ్యత్వాలను తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బి.మల్లేశ్వరరావు, సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కె.సోమసుందరరావు, పి.నర్సింహమూర్తి, ఎం.ఎస్.ఆర్.ఎస్. ప్రకాశరావు, పి.ఎస్.ప్రసాదరావు, బి.చిన్మయరావు, ఎం.వి.రావు, చైతన్యకుమార్, ఎ.నరసింగరావు, గుణాకరరావు, బి.సతీష్, కె.రమణమూర్తి ఉన్నారు.

ఉమ్మడి సర్వీస్ రూల్స్‌పై ఉపాధ్యాయుల హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయ సంఘం సభ్యులు

ఇచ్ఛాపురం: ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ విడుదలపై పురపాలక సంఘాల్లో పని చేస్తున్న టీచర్లు, సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. అనేక సంవత్సరాలుగా పురపాలక సంఘం ఉపాధ్యాయులంతా ఉమ్మడి సర్వీస్ రూల్స్ విడుదల చేయాలని గతంలో ఉన్న ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పురపాలక సంఘం ఉపాధ్యాయులకు సంబంధించిన సర్వీస్ రూల్స్ డ్రాఫ్టుని విడుదల చేయడంతో వారిలో ఆనందం వెల్లువిరిసింది. ఈ మేరకు స్థానిక పురపాలక బాలికోన్నత పాఠశాల ఆవరణలో బుధవారం పురపాలక ఉపాధ్యాయ సంఘం జేఏసీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సంతోషం వ్యక్తం చేశారు. సర్వీస్ రూల్స్‌లో చిన్నపాటి లోపాలను సవరణ చేసి పురపాలకసంఘం ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖాధికారిగాను, జూనియర్ లెక్చరర్‌గాను పదోన్నతలు కల్పించాలని ప్రభుత్వానికి విన్నవించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గగణకుమారి, విజయ, ధర్మాన భాస్కర్‌రావు, సిద్ధాంతి, వల్లభరావు, సత్యనారాయణ, శంకర్ పాల్గొన్నారు.

భద్రాచలానికి ప్రత్యేక బస్సు



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బయలుదేరిన బస్సు

శ్రీకాకుళం అర్బన్: శ్రీరామనవమి సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో శ్రీకాకుళం కాంప్లెక్స్ నుంచి బుధవారం సాయంత్రం ఆర్టీసీ సూపర్‌డీలక్స్ బస్సు భద్రాచలానికి బయలుదేరింది. ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాది రామున్ని దర్శించుకునేందుకు వేసిన ప్రత్యేక బస్సును భక్తులు సద్వినియోగం చేసుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎస్ఎం వి.శామ్యూల్, టీఐ-3 ఎల్ఎస్ నాయుడు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,670-00
బంగారం(22సి. 10గ్రా.)	54,700-00
వెండి (కిలో)	76,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹113	₹196	₹ 206

టీడీపీ నాయకుల భూ ఆక్రమణలపై ఫిర్యాదుల వెల్లువ

- ప్రత్యేక స్పందనకు విశేష స్పందన
- అర్జీలు స్వీకరించిన మంత్రి అప్పలరాజు, జేసీ నవీన్



వినతులు స్వీకరిస్తున్న జేసీ నవీన్, ఆర్డీవో సీతారామమూర్తి, మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గం పరిధిలో భూఆక్రమణలపై బుధవారం చేపట్టిన ప్రత్యేక స్పందనకు విశేషస్పందన లభించింది. టీడీపీ నాయకుల భూ ఆక్రమణలపై అధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలోని సర్వసభ్య సమావేశ మందిరంలో ఉదయం పదిన్నర గంటలకు రెవెన్యూ ఉన్నతాధికారుల సమక్షంలో నిర్వహించిన స్పందనలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కుమార్, పలాస ఆర్డీవో సీతారామమూర్తిలు అర్జీలు స్వీకరించారు. పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాలతోపాటు పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు చెందిన ప్రజలు, బాధితులు వినతులు అందజేశారు. అందిన అర్జీలపై దర్యాప్తు చేసి ఆక్రమణలు తొలగిస్తామని జేసీ నవీన్ వెల్లడించారు. అధిక సంఖ్యలో వినతులు వచ్చినప్పటికీ.. కేవలం రెవెన్యూ సమస్యలు, ఆక్రమాలు ఉన్న వాటిని మాత్రమే పరిగణలోకి తీసుకున్నారు.

వినతులు ఇలా..

- పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస మండలం పరిధిలో 110 వినతులు, మందస నుంచి 18, వజ్రపుకొత్తూరు నుంచి ఎనిమిది వినతులు వచ్చాయి.

టీడీపీ నాయకులపై ఫిర్యాదులు

ఫిర్యాదుల్లో ఎక్కువగా టీడీపీ నాయకుల భూ ఆక్రమణలపైనే ఉన్నాయి.

- సర్వేనంబర్ 26లో ఎర్ర కాలువలో 50 సెంట్లలో 16 సెంట్లు టీడీపీ నాయకులు ఆక్రమించారని ఫిర్యాదు అందింది.
- సర్వే నంబర్ 34, 35 పురుషోత్తపురం రెవెన్యూ పరిధిలో ఒక ఎకరా స్థలం ఆక్రమించారని చర్యలు చేపట్టాని కోరారు.
- సర్వే నంబరు 50లో 20 ఎకరాలు అక్రమించి అక్రమంగా పదేకరాల్లో లేఅవుట్ వేశారని.. దీనికి సంబంధించి డిజిటల్ సైన్ కూడా లేకుండా రికార్డులు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.



టీడీపీ నాయకులపై ఫిర్యాదు చేసిన శిష్టు గోపి

- సర్వే నంబరు 51 సూదికొండ మరిడమ్మ తల్లి ఆలయం వెనుకభాగంలో రెండు ఎకరాల స్థలాన్ని టీడీపీ మాజీ కౌన్సిలర్ కోట్ల రూపాయలకు విక్రయించారని 19వవార్డు కౌన్సిలర్ శిష్టు గోపి ఫిర్యాదు చేశారు.
- గిరిజన భూములు వైశ్యునికి బహుమతిగా ఇచ్చినట్లు 19 ఎకరాలు రాసి ఉన్నారని.. మొత్తంగా ప్రభుత్వానికి చెందిన 40 ఎకరాల్లో ఇవి తీసుకుని ఉన్నారని, పలాస పెట్రోల్ బంకు దేవాలయం తొలగించి నిర్మించుకున్నారని పెంట శంకర్‌పై కొంచాడ రాజాశ్రీకాంత్ ఫిర్యాదు చేశారు.
- పలాస ఇండస్ట్రీయల్ ఎస్టేట్ ఎదురుగా 258/01లో 51సెంట్లు ఆక్రమణ, 257/01 లో 75 సెంట్లు ప్రభుత్వస్థలాన్ని టీడీపీ నాయకులు ఆక్రమించారని డబ్బీరు భవానీశంకర్ ఫిర్యాదు చేశారు.
- సర్వే నంబరు 293లో సుమారు 04.1/5 ఎకరాల ప్రభుత్వ భూమిని తుంగభద్ర చెరువులో ఆక్రమించారని చర్యలు చేపట్టాలని కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు ఫిర్యాదు చేశారు.

నాకు ప్రాణహాని ఉంది



మాది మందస మండలం భోగాపురం. విశ్రాంత ఉపాధ్యాయుడుని. నాకు ఉన్నటువంటి ఎకరా రెండు సెంట్ల స్థలాన్ని టీడీపీ నాయకులు ఆక్రమించి నాపై దాడికి దిగుతున్నారు. సర్వేనంబరు 101/40లో నా భూమి ఉంది. వారిని ప్రశ్నిస్తుంటే కొట్టడానికి వస్తున్నారు. చంపడానికి కూడా సిద్ధమవుతున్నారు. ప్రాణాలు చేత పట్టుకుని సోంపేటలో బతుకుతున్నాం. ప్రాణహానీ ఉంది. బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన తనకు న్యాయం చేయాలి.

– అప్పన్నా నెప్పకో, విశ్రాంత ఉపాధ్యాయులు

- కాశీబుగ్గ సర్వేనంబరు 113లో జగన్నాథసాగరం 58 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉందని.. అందులో ఎనిమిది ఎకరాలు స్థలాన్ని టీడీపీ నాయకుడు ఆక్రమించారని గూన మన్మథరావు ఫిర్యాదు చేశారు.
- సర్వే నంబర్ 22/07లో ఆర్టీసీ కాంప్లెక్సు ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమి రూ.3 కోట్లు పలుకుతోందని.. జీడి కార్మికులకు కల్యాణ మండపానికి కేటాయించాలని..లేదంటే టీడీపీ నాయకులు చేజిక్కించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని అంబటి ఆనందరావు ఫిర్యాదు చేశారు.

ఆక్రమణలు నిరూపిస్తే రాజకీయాలు విరమిస్తా

- ప్రత్యేక స్పందనలో మంత్రి సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు. పక్కనే జేసీ నవీన్, ఆర్డీఓ సీతారామమూర్తి

కాశీబుగ్గ: పలాసలో 'ఆ నలుగురు' భూముల ఆక్రమణలకు పాల్పడుతున్నారంటూ తనను ఉద్దేశించి ఎల్లో మీడియాలో తరచూ వార్తలు రాస్తున్నారని, ఆ నలుగురి పేరిట ఇంచీ భూమి ఉన్నట్లు నిరూపించినా రాజకీయాల నుంచి విరమిస్తానని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. బుధవారం శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో నిర్వహించిన ప్రత్యేక స్పందన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. తన అనుచరులు ఎవరు తప్పు చేసినా తాను తప్పు చేసినట్లేనని, అక్రమాలు జరిగినట్లు చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని స్పష్టం చేశారు. తెలుగుదేశం నాయకుల మీదా ఫిర్యాదులు వచ్చాయని, వజ్జ బాబూరావు, డిక్కల ఆనంద్, కుత్తుం లక్ష్మణరావు ఇలా అనేక మంది నాయకులు ఆక్రమణలు చేశారని చెప్పారు. అవి కోర్టులో ఉన్నాయని, ఆ ఆక్రమణలు కూడా తొలగిస్తామని చెప్పారు. గౌతు కుటుంబం 60 ఏళ్లపాటు ఈ ప్రాంతాన్ని భ్రష్టు పట్టించిందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తరువాత పలాస అభివృద్ధికి అన్నీ తీసుకువచ్చామని తెలిపారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు నిరాధారమైన వార్తలు రాస్తున్నాయని మండిపడ్డారు. అప్పటి ఎమ్మెల్యే శివాజీ హయాంలో అక్రమాలు జరిగితే అదేదో తాము చేసినట్లు తమపై రాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శివాజీ అల్లుడు పలాసలో ఏ వ్యాపారాలు చేసినా వారి వద్ద కమీషన్లు దండుకునేవారని ఆరోపించారు. పలాసకు ఇప్పుడు పెద్ద పెద్ద మాల్స్ వస్తున్నాయని, స్వేచ్ఛాయుతంగా వ్యాపారాలు జరుగుతున్నాయని చెప్పారు. టీడీపీ నాయకుడు, చైర్మన్‌గా పనిచేసిన వజ్జ బాబూరావు కాలువలో పాఠశాల కట్టారని, జగన్నాథసాగరంలో 8 ఎకరాల స్థలం ఆక్రమించి వెంచర్ వేయడం మీకు తెలియదా అని ప్రశ్నించారు. ఎర్రచెరువు లేఅవుట్ బాబూరావు వేసింది కాదా అని ప్రశ్నించారు. డిగ్రీ కళాశాలకు మూడున్నర ఎకరాలు, పెంటిపద్రలో నాలుగు ఎకరాలు యాభై సెంట్లను తెలుగుదేశం బడానాయకుడు పెంట ఉదయ్‌కుమార్ వద్ద రికవరీ చేశామని చెప్పారు. బొడ్డపాడులో 7 ఎకరాలు, రెంటికోటలో 80 సెంట్లు, ఇంగిలిగాంలో ఎకరా ఎనభై సెంట్లు, జయరామచంద్రపురంలో లొడగల కామేష్ వద్ద రెండు ఎకరాలు, మార్కెట్ కమిటీ వద్ద రెండు ఎకరాలు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. రెండు మూడు నెలల తర్వాత మళ్లీ స్పందన నిర్వహించి చర్యలు చేపడతామన్నారు.

కార్మికుల భద్రతకే ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న శివశంకర్‌రెడ్డి

రణస్థలం : రసాయన కర్మాగారాల్లో ఉద్యోగులు, కార్మికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్‌రెడ్డి అన్నారు. పైడిభీమవరం పారిశ్రామికవాడలో ఆంధ్రా ఆర్గానిక్స్ యాజమాన్యం ఆధ్వర్యంలో 52వ జాతీయ భద్రతా వారోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యాలు సూచించే భద్రతా ప్రమాణాలను ఉద్యోగులు, కార్మికులు విధిగా పాటించాలన్నారు. హెల్మెట్, షూ, గ్లౌజ్, కళ్లద్దాలు వంటివి ధరించాలన్నారు. అనంతరం భద్రతా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చిన్నారావు, చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ జి.వి.ఆర్ నగేష్, జీఎం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశీలు వసూళ్ల కాంట్రాక్టర్‌పై ఫిర్యాదు



ఎంపీడీవో నిశ్చలకు ఫిర్యాదు చేస్తున్న వ్యాపారులు

కోటబొమ్మాళి: నారాయణవలస పశువుల సంత ఆశీలు వసూళ్ల కాంట్రాక్టర్ యాళ్ల రాముపై తిలారు, నారాయణవలస, పెద్దదూగాం గ్రామాలకు చెందిన వ్యాపారులు తర్ర భాస్కరరావు, దుమ్ము ఆనందరావు, మంత్రి రమణయ్య, జి.శ్రీను తదితరులు ఇన్‌చార్జి ఎంపీడీవో నిశ్చలకు బుధవారం ఫిర్యాదు చేశారు. కొద్దిరోజులుగా సంత కాంట్రాక్టర్ అధికంగా ఆశీలు వసూళ్లు చేస్తున్నారని, ఆవుకు రూ. 150, గొర్రెకు రూ. 199, కోడికి రూ. 30, కూరగాయల బుట్టకు రూ. 30 చొప్పున్న వసూల్లు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేపట్టి ప్రభుత్వ నింబంధనల మేరకు ఆశీలు వసూల్లు చేయాలని, సంతలో ధరల పట్టిక బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఫిర్యాదుదారులకు హామీ ఇచ్చారు.

నేరాలను నియంత్రించండి

- పోలీసు అధికారుల సమీక్షలో ఎస్పీ జి.ఆర్.రాధిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, ఆస్తి నేరాలను నియంత్రించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఎస్పీ జి.ఆర్.రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలించాలని, తరచూ రవాణాకు పాల్పడుతున్న వారిపై నిఘా పెట్టాలని, ఉపయోగించే వాహనాలను సీజ్ చేసి వ్యక్తులను అరెస్టు చేయాలన్నారు. వారి ప్రవర్తనలో మార్పు రాకుంటే పీడీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఆస్తి నేరాలు జరగకుండా ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి, పగలు గస్తీ పెంచాలన్నారు. పాత కేసులో నేరస్థులపై నిఘా పెట్టాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కొత్త, అనుమానిత వ్యక్తుల గురించి ఆరా తీయాలన్నారు. వ్యాపార సముదాయాలు, బ్యాంకులు, ఏటీఎంలు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో జాతీయ రహదారి పొడవునా తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలన్నారు. విజిబుల్ పోలీసింగ్, వాహనాల తనిఖీలు నిర్వహించాలన్నారు. అతివేగంగా వాహనాలను నడిపేవారిని గుర్తించి రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, ఎస్‌బీ డీఎస్పీ ఎస్.బాలరాజు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై జేసీ ఆగ్రహం



మధుసూదనరావును హెచ్చరిస్తున్న జేసీ నవీన్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం జరిగిన ప్రత్యేక స్పందనలో పలాస, మున్సిపాలిటీకి సంబంధించి 110 సమస్యలు అధికారుల దృష్టికి వచ్చాయి. దీంతో పలాస తహసీల్దార్ మధుసూదనరావుపై జిల్లా జాయింట్ కలెక్టర ఎం.నవీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపాటి సమస్యలు కూడా పరిష్కారం చేయకుండా ఏంచేస్తున్నారని, అసలు విధులకు వెళ్తున్నారా అని ప్రశ్నించారు. కార్యాలయంలో పరిష్కారం కావాల్సినవి కూడా ఎందుకు పరిష్కరించడం లేదన్నారు. కార్యాలయంలో పనితీరుపై అనుమానాలు ఉన్నాయని ఆర్డీవో సీతారామమూర్తి, మంత్రి అప్పలరాజు సమక్షంలో క్లాస్ పీకారు. సమస్యలన్నీ తహసీల్దార్ కార్యాలయం నుంచే తలెత్తుతున్నాయన్నారు.

భార్యపై భర్త దాడి

కొత్తూరు: భార్యపై భర్త దాడి చేసినట్టు ఫిర్యాదు అందిందని ఎస్సై ఎం.గోవింద బుధవారం తెలిపారు. మాకవరం గ్రామానికి చెందిన చీకటి కాంచనదేవి, నాయుడు దంపతులు. 12 ఏళ్లగా తన భర్త నాయుడు మద్యం తాగి వచ్చి శారీరంగా హింసిస్తున్నాడని కాంచనదేవి ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. ఈ నెల 28 తేదీన కూడా మద్యం తాగివచ్చి కొట్టి తోసేయడంతో పక్కన ఉన్న బైక్‌పై పడిపోయినట్టు ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

- చివరిరోజున 816 మంది గైర్హాజరు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు ముగిశాయి. ప్రథమ సంవత్సరం పరీక్షలు మంగళవారంతో ముగియగా.. ద్వితీయ సంవత్సరం పరీక్షలు బుధవారం ముగిశాయి.

పక్కా నిఘా మధ్య..

పక్కా నిఘా మధ్య పరీక్షలు జరిగాయి. సీసీ కెమెరాలతో ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వారా కేంద్రాలపై పక్కా నిఘా ఉంచడంతో ఎక్కడా డీబార్‌లు నమోదు కాలేదు. రాష్ట్ర పరిశీలకులు, జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కె.ప్రకాశరావు, ఆర్ఐవో ఎస్.తవిటినాయుడు, డీఈసీ, హైపవర్ కమిటీ, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు ఆకస్మిక తనిఖీలతో హోరెత్తించినప్పటికీ ఒక్క మాల్‌ప్రాక్టీసు కూడా నమోదు కాకపోవడం గమనార్హం.

816 మంది డుమ్మా

బుధవారం సెట్-3 ప్రశ్నాపత్రంతో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కెమిస్ట్రీ పేపర్-2, కామర్స్ పేపర్-2కు పరీక్షలు రాశారు. 109 కేంద్రాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షలకు 25,268 మంది హాజరుకావాల్సి ఉండగా 24,452 మంది పరీక్ష రాశారు. 816 మంది గైర్హాజరయ్యారు.

మూల్యాంకనానికి ఏర్పాట్లు

ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల కేంద్రంగా జవాబుపత్రాల దిద్దుబాటు ప్రక్రియ మొదలుకానుంది. నాలుగు విడతల్లో జరగనున్నవాల్యూయేషన్ ప్రక్రియకు అధికారులుఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగియడంపై ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా ఆర్ఐవో శివ్వాల తవిటినాయుడు సంతోషం వ్యక్తం చేశారు.

శ్రీరామ నవమి శుభాకాంక్షలు
పారామెడికల్ డిగ్రీ / డిప్లొమా కోర్సులు, నర్సింగ్, బి.పి.టి కోర్సుల కొరకు సంప్రదించండి
జెమ్స్ హాస్పిటల్ ప్రాంగణం
రాగోలు, శ్రీకాకుళం
7680945357
7337330138

వైభవంగా కుతారిచండీ యాత్ర

- పోటెత్తిన భక్తజనం



పూజలందుకున్న కుతారిచండీ అమ్మవారు



జాతరకు తరలివచ్చిన భక్తజనం

కవిటి: ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం, కుతారిచండీ అమ్మవారి యాత్ర వింధ్యగిరి గ్రామంలో బుధవారం కన్నుల పండువగా జరిగింది. మంగళవారం అర్ధరాత్రి ఒడిశా చీకటి ప్రాంతానికి చెందిన రాజవంశీయులు కుతారిచండీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సంప్రదాయబద్ధంగా తొలిదీపం వెలగించారు. అమ్మవారి దర్శనానికి ఈ ఏడాది భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. లోకకల్యాణార్థం అమ్మవారికి చండీహోమం నిర్వహించారు. 20 వేలమంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా తదితర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 40 మంది పోలీసులతో కవిటి ఎస్సై కె.రాము బందోబస్తు నిర్వహించగా.. రాజపురం ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు.

పకడ్బందీగా టెన్త్ పరీక్షల నిర్వహణ

శ్రీకాకుళం పాతబస్టాండ్ : పదో తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో బుధవారం వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు.కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, డీఈఓ పగడలమ్మ, సహాయ కమిషనర్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక సేద్యంతో అధిక దిగుబడులు

- వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- త్వరితగతిన ధాన్యం కొన్నామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ వెల్లడి



మాట్లాడుతున్న నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణతో సాగు చేస్తే వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని మాజీ ఉపముఖ్యమంత్రి, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కూడా రైతు బిడ్డనే అయినా, తనకు తెలియని విషయాలు చాలా ఉన్నాయన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు దిగువ స్థాయి వరకు తెలియజేయడం ద్వారా సరైన ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి చెల్లింపులు వేగవంతంగా జరిగాయన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని ఆర్.బి.కె స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి రైతులకు చేరవేయాలని సూచించారు. విత్తనాభివద్ధి సంస్థ జిల్లా మేనేజర్, వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో ముందుకువెళ్లాలన్నారు. 1962 సంచార పశువైద్య వాహనాలు తరచూ గ్రామాల్లో పర్యటించి పశువులకు వైద్యం అందజేసేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. దళారీ వ్యవస్థను నిర్మూలించి సకాలంలో రైతులకు ధాన్యం డబ్బులు, కూలి, గోనెసంచుల డబ్బులు సకాలంలో అందజేసినట్లు తెలిపారు. వ్యవసాయ సలహా మండలి బోర్డు చైర్మన్ నేతాజీ మాట్లాడుతూ అందరి సహకారంతో మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. వంశధార, నీటివనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ డోల తిరుమలరావు మాట్లాడుతూ గుర్రపు డెక్క, షట్టర్ల సమస్యలతో నీటి విడుదలలో కొంత జాప్యం జరిగిందన్నారు. పది రోజుల్లో నీటిని విడుదల చేస్తామన్నారు. పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి మాట్లాడుతూ అందరి సహకారంతో పూర్తి స్థాయిలో నిర్దేశిత సమయంలో ధాన్యం సేకరణ పూర్తి చేసినట్లు చెప్పారు. జిల్లా వ్యవసాయ అధికారి కె.శ్రీధర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా జిల్లాలో చేపడుతున్న పనులను సభ్యులకు వివరించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి మాట్లాడుతూ పశుబీమా బిల్లులు ట్రెజరీలో ఉన్నాయని తెలిపారు. కె.వి.కె.లో శిక్షణ పొంది ఎన్.జి.రంగా యూనివర్సిటీలో మిల్లెట్స్-2023 అవార్డు అందుకున్న ఎస్.సుజాత చిరుధాన్యాల వినియోగం వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు. సమావేశంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, రాష్ట్ర వ్యవసాయ మిషన్ సభ్యులు గొండు రఘురాం, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు డా.ఎం.కిషోర్, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.వి.శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి రత్నాల వరప్రసాదరావు, పట్టు పరిశ్రమ, మార్కెటింగ్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
- We are giving coaching for EAMCET, POLITECHNIC ENTRANCE, IIT-JEE, NEET. Con: 9110723438, 9573968872 [G-6621]

COACHING CENTER
- Eamcet, I-Cet & For All Competitive Exams. New Batches on 01-04-2023 @ 9am. SURYA ACADEMY, GURAJADA Road, Kota Jn., Vizianagaram. Ph : 99490 03295 [V-6104]

REAL ESTATE
- శ్రీకాకుళం, విశాఖపట్నంలలో అతి తక్కువ ధరలలో ఇండిపెండెంట్ హౌసులు, ఫ్లాట్స్, గ్రూపు హౌసులు లోను సౌకర్యముతో లభించును సంప్రదించండి. సెల్: 9493086239 [S-756389]

WANTED
- రాష్ట్ర వ్యాప్తంగా పేద కుటుంబాల సర్వే కొరకు మీ జిల్లా, మండల పరిధిలో పనిచేయుటకు ఇజ్నా సొసైటీ మండల, జిల్లా కో ఆర్డినేటర్ నియామకాలకు దరఖాస్తు కోరుతున్నారు. విద్యార్హత: ఇంటర్మీడియట్, జీతం: 9 వేలు + రవాణా ఖర్చులు. సెల్: 8019101089 [S-1180467]
- కొత్తగా ప్రారంభం కానున్న BMTC కంపెనీలో పనిచేయుటకు 7 మంది యువకులు కావలెను. ఫీజులేదు, రూం ఫ్రీ, Q: 10th పాస్/ఫెయిల్, వ॥ 28 సం॥లోపు సంప్ర॥ VJA సెల్: 7730020450. [WA-6926]

- ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9069509586 [G-795276]
- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని ₹3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9959617233, 7386491696 [M-1190657]
- VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, Rmp Dr, Q: 5th- డిగ్రీ. 10-30 వేలు జీతం, భో+రూ ఫ్రీ, Hyd, Ph: 7995365999 [HA-1151]
- ప్రముఖ బ్యాంకుల యందు కాంట్రాక్టు పద్ధతిలో వర్క్ చేయడానికి ఫిమేల్ స్టాప్ అ.కా.ను. జీ.15K to 34K ఇంట్రెస్ట్ ఉన్నవారు డిటెయిల్స్ వాట్సాప్ చేయండి. ఫోన్ : 6281159171 [HA-28700]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.